



విజ్ఞానం..వినోదం

స్టూడెంట్.. టూరిజం 7

తెలంగాణ దర్శిని పేరుతో పర్యాటక ప్రాంతాల సందర్శన

నేడు జాతీయ పర్యాటక దినోత్సవం



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పక్కన కలెక్టర్ పమేలా సత్పతి

బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- సమీక్షా సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్
- విరాళాలకు దాతల నుంచి విశేష స్పందన

కరీంనగర్ కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, చారిత్రాత్మక విశిష్ఠత గల మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ప్రతీ యేడు మాదిరిగా అందరం కలసి ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్సవాల మధ్యలో ఎలక్షన్ కోడ్ రాబోతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఉత్సవాలు జరుగుతాయని అన్నారు. గత సంవత్సరం ఆలయం నుంచి ఒక్క రూపాయి తీసుకోకుండా ఉత్సవాలు నిర్వహించామని, ఈ యేడు కూడా శ్రీవారి ఉత్సవాలకు దాతలు గతంలో కంటే మరింతగా స్పందించి ముందుకు రావాలని కోరారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ గత యేడు కంటే ఉత్సవాలను గొప్పగా నిర్వహించుకుందామని అన్నారు.

ఇప్పటికే వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించామని, గతంలో ఏర్పడిన కొన్ని సమస్యలను అధిగమిస్తూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటామని అన్నారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ మాట్లాడుతూ ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని అన్నారు. 10వ తేదీన సాయంత్రం 6 గంటలకు మార్క్‌ఫెడ్ గ్రౌండ్ నుంచి శ్రీవారి శోభాయాత్ర ఉంటుందని తెలిపారు. ప్రతీ రోజూ ఉదయం సాయంత్రం భజనలు, కీర్తనలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. అంతకు ముందు ఆలయంలో మంత్రి పొన్నంతో పాటు కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పూజలు నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలయ వ్యవస్థాపక వంశ పారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈఓ కందుల సుధాకర్, సిబ్బంది, అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్, కటకం వేంకటరమణ తదిరులు పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కోరిక మేరకు పలువురు వ్యాపార, వాణిజ్య సంస్థల బాధ్యులు, నగర ప్రముఖులు ప్రత్యక్షంగా పరోక్షంగా స్పందించి విరాళాలు ప్రకటించారు.



హాజరైన వ్యాపార, వాణిజ్య సంస్థల నిర్వాహకులు, నగరవాసులు

మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల ప్రాంతీయ సమన్వయ అధికారి కె సురేష్ ఒక ప్రకటనలో కోరారు. 5వ తరగతిలో నూతన ప్రవేశాలతో పాటు 6,7,8 తరగతులలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీలతో పాటు వృత్తి విద్యా కోర్సుల్లో సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఎలాంటి రుసుము లేకుండా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఫిబ్రవరి 15వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో 24 మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలు ఉన్నాయని, 5వ తరగతిలో మైనార్టీ విద్యార్థులకు-10, ఎస్టీలకు-3, ఓసీలకు-1 వంతున, ఇంటర్ మొదటి సంవత్సరంలో మైనార్టీ విద్యార్థులకు-30, ఎస్సీలకు-2, ఎస్టీలకు-2, ఓసీలకు-1 వంతున కేటాయిస్తారని తెలిపారు. 5వ తరగతితోపాటు ఇంటర్ మొదటి సంవత్సరంలో 75 శాతం మైనార్టీ విద్యార్థులకు, 25 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలకు కేటగిరిలకు కేటాయిస్తారన్నారు.



హౌసింగ్‌బోర్డులో ఏర్పాటుచేసిన బహిరంగ సభకు హాజరైన నగర ప్రజలు



అభివృద్ధిలో తోడుగా ఉంటాం

- నిరంతర నీటి సరఫరా చరిత్రాత్మకం
- కరీంనగర్‌లో డంపింగ్ యార్డు ప్రక్షాళన చేస్తాం
- స్మార్ట్‌సిటీ నిధులతో అభివృద్ధిలో కరీంనగర్ ఆదర్శం
- కరీంనగర్‌పై కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ప్రశంసల జల్లు

కరీంనగర్ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):స్మార్ట్‌సిటీ నిధులను సక్రమంగా వినియోగించుకొని కరీంనగర్ అభివృద్ధిలో దేశంలోనే ఆదర్శంగా నిలిపారు.. భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు కృషిచేయాలి... మీరు ఒక అడుగు ముందుకు వేస్తే... మేము రెండు అడుగులు వేసి మీ అభివృద్ధికి తోడుగా ఉంటామని కేంద్ర పట్టణాభివృద్ధి, విద్యుత్‌శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ హామీ ఇచ్చారు. కరీంనగర్ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య డంపింగ్ యార్డును కేంద్రం నిధులతో ప్రక్షాళన చేస్తామని హామీ ఇచ్చారు. శుక్రవారం కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ అభి వృద్ధిలో భాగంగా నిర్మించిన మల్టీపర్పస్ పార్కు, అంబేద్కర్ స్టేడియం స్పోర్ట్స్ కాంప్లెక్సు కుమార్‌వాడీ పాఠశాలలోని ఈక్లాస్ రూమ్స్‌ను ప్రారం భించిన అనంతరం హౌజింగ్‌బోర్డుకాలనీలో ప్రతిరోజూ నిరంతర నీటి సరఫరా (24/7) పైలెట్ ప్రాజెక్టుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూప రాణి హరిశంకర్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అక్కడే ఏర్పా టు చేసిన బహిరంగ సభలో కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ కరీంనగర్‌పై, మంత్రి బండి సంజయ్‌కుమార్, మేయర్ సునీల్‌రావుతోపాటు ప్రజాప్రతి నిధులు, అధికారులపై ప్రశంసల జల్లు కురిపించారు.



24/7 వాటర్ సప్లై రిజర్వాయర్ వద్ద శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి ఖట్టర్

- **ఆకట్టుకున్న కేంద్రమంత్రి ఖట్టర్ తెలుగు ప్రసంగం :**

నా ప్రియమైన కరీంనగర్ పౌరులారా నమస్తే అంటూ తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి మనోహర్‌లాల్‌ఖట్టర్ 150 సెకన్ల పాటులో తెలుగు మాట్లాడుతూ ఆహూతులను కట్టిపడేశారు. నా చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించే అవకాశం కల్పించినందుకు బండి సంజయ్ కుమార్‌కు ధన్యవాదాలు చెబుతున్నా. దేశంలోనే తెలంగాణ సుసంపన్నమైన రాష్ట్రం. ఎన్నో పోరాటాలకు నిత్య చైతన్యాలకు, త్యాగాలకు పురిటి గడ్డ ఈ కరీంనగర్ నేల..కరీంనగర్ ప్రజలు నిత్యం ఉత్సాహంతో కన్పిస్తారు. కష్టపడి పనిచేస్తున్న బండి సంజయ్‌ను నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా...

మిగతా 8వ పేజీలో

పచ్చదనం.. పరిశుభ్రత భేష్

నాలుగేళ్లలో దేశంలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీటిని కుళాయి ద్వారా అందించడమే మా కేంద్ర ప్రభుత్వ లక్ష్యం అని ఖట్టర్ పేర్కొన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద ఐదు డివిజన్లో 4,050 ఇళ్లకు 24గంటల పాటు తాగునీటిని అందించాలనే ఆశయం నెరవేరడానికి అంకురార్పణ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈరోజు ప్రారంభంలో భాగంగా 2,200 ఇళ్లకు 24 గంటల పాటు తాగునీటిని ప్రారంభించామని, మిగతావి త్వరలో అందుబాటులోకి వస్తాయని అన్నారు. దేశంలో ఇలా ఎక్కువ ఇళ్లకు ప్రతిరోజూ నిరంతరంగా తాగునీటిని అందిస్తున్న ఘనత కరీంనగర్ కార్పొరేషన్‌కే దక్కుతుందని అన్నారు. దేశవ్యాప్తంగా 100 కార్పొరేషన్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు స్మార్ట్‌సిటీ పథకాన్ని అమలులోకి తీసుకొచ్చామన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ కూడా స్మార్ట్ సిటీ నిధులను సమగ్రంగా వినియోగించుకుని అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తుందని అభినందించారు. మిగతా పట్టణాలతో పోలిస్తే కరీంనగర్ స్మార్ట్‌సిటీ పనులు చాలా బాగా జరిగాయని, రోడ్ల చుట్టూ పచ్చదనం బాగుందని కొనియాడారు. స్మార్ట్‌సిటీ మిషన్ కింద తెలంగాణలోని వరంగల్, కరీంనగర్ నగరాలకు రూ 1,116కోట్ల నిధులు విడుదల చేశామని అన్నారు.మిగతా నగరాలకు భిన్నంగా కరీంనగర్ కార్పొరేషన్ ఆచరణలో చూపించిందని అన్నారు. స్మార్ట్‌సిటీ కింద కరీంనగర్‌కు రూ. 826కోట్లు వచ్చాయన్నారు. ఇందులో కేంద్రం నుంచి రూ.428 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.398 కోట్లు విడుదలయ్యాయన్నారు. మిగతా పనులు కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

మాట్లాడుతున్న కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్

అభివృద్ధే మా అందరి ఎజెండా

- మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో విభేదాలు లేవు
- కరీంనగర్‌లో ఈఎస్‌ఐ ఆసుపత్రి ఏర్పాటు
- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్



కరీంనగర్ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బిడ్డగా నగర అభివృద్ధికి కంకణం కట్టుకున్నా.. రాజకీయాలకు అంతీతంగా ప్రజాప్రతినిధులందరం కలిసికట్టుగా పనిచేస్తాం. తనకు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు మధ్య ఎలాంటి విభేదాలు లేవు.. పొన్నం ప్రభాకర్, గంగుల కమలాకర్ మధ్య ఏమైనా విభేధాలుంటే ఈ రోజు నుంచి ఉండవు... రాజకీయాలు.. జెండాలు, సొంత ఎజెండాలను పక్కన బెట్టి కరీంనగర్‌ను అభివృద్ధి చేస్తామని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు.

శుక్రవారం హౌసింగ్‌బోర్డులో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ బిడ్డగా, మానేరు నీరు తాగిన వ్యక్తిగా చెబుతున్నా కరీంనగర్‌ను అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటించారు. కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ పేదరికం నుంచి వచ్చిన వ్యక్తి అని, ఆయన తండ్రి కిరాణ షాపు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించారని, కష్టపడి ఎదిగిన ఖట్టర్ కేంద్ర మంత్రి స్థాయికి ఎదగడం గొప్ప విషయమమని అన్నారు. అంతటి గొప్ప వ్యక్తి కరీంనగర్‌కు రావడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. నగరంలోని 4వేల ఇళ్లకు నిరంతరంగా 24 గంటల పాటు మంచి నీటిని అందించడం గర్వకారణమని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కరీంనగర్‌లో 24 గంటల నిరంతర నీటి సరఫరాకు శ్రీకారం చుట్టామన్నారు. వేములవాడ రాజన్న ఆలయాన్ని ప్రసాద్ స్కీంలో చేరుస్తున్నామని, కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాలను రామా యణ్ సర్క్యూట్‌లో చేరుస్తామని అన్నారు. సిరిసిల్ల, వంగరలలో నవోదయ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కరీంనగర్‌లో ఈఎస్‌ఐ హాస్పిటల్‌ను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో జాతీయ రహదారులను అభివృద్ధి చేశామని అన్నారు.



బహిరంగ సభ వేదికపైన నాయకులు,-అధికారులు

మానేరు రివర్ ఫ్రంట్‌కు రూ.300 కోట్లు మంజూరు చేయండి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్




కరీంనగర్ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రంలోని సబర్మతి రివర్ ఫ్రంట్ తరహాలో దక్షిణాది రాష్ట్రంలోనే మొట్టమొదటగా కరీంనగర్‌లో చేపట్టిన మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పూర్తయ్యేందుకు అవసరమైన 300 కోట్ల రూపాయల నిధులను కేంద్రం నుంచి మంజూరు చేసి పర్యాటకంగా కరీంనగర్ అభివృద్ధికి సహకరించాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కోరారు.

శుక్రవారం నగరంలో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. కరీంనగర్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం 500 కోట్లను కేటాయించడంతో ఆ నిధులతో పనులు చేపటామని, మిగిలిన పనులు పూర్తి చేసేందుకు అవసరమైన 300 కోట్ల నిధులను మంజూరు చేయాలని కోరారు. మానేరు రివర్‌ఫ్రంట్‌తోపాటు మానేరు నదిపై 230 కోట్లతో తీగెలవంతెన నిర్మాణం చేశామని పేర్కొన్నారు. హౌజింగ్‌బోర్డులో పైలెట్ ప్రాజెక్టుగా ప్రతిరోజు నిరంతర నీటి సరఫరాను ప్రారంభించామని, కరీంనగర్ మొత్తానికి నిరంతర నీటి సరఫరాకు నిధులు మంజూరు చేయాలని కోరారు. నిధుల మంజూరుకి కేంద్ర, రాష్ట్ర మంత్రులు బండి సంజయ్‌కుమార్, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సహకరించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మంత్రి ఖట్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ మెమెంటోతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు 24/7 వాటర్ నమూనాను చూపుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు



బీఆర్‌ఎస్‌కు బై..బై..

- మేయర్ సునీల్‌రావు బాటలో 10 మంది కార్పొరేటర్లు
- నేడు కేంద్రమంత్రి 'బండి' సమక్షంలో బీజేపీలో చేరిక

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు బీఆర్‌ఎస్ పార్టీకి గుడ్ బై చెప్పి బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఆయనతో పాటు 10 మంది కార్పొరేటర్లు కూడా బీఆర్‌ఎస్‌ను వీడనున్నారు. శనివారం నగరంలోని ఎస్‌బీఎస్ ఫంక్షన్‌హాల్‌లో కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ సమక్షంలో బీజేపీలో చేరుతున్నట్లు సునీల్‌రావు ప్రకటించారు. కొద్ది కాలంగా బండి సంజయ్ కుమార్‌తో సన్నిహితంగా ఉంటూ వస్తున్న సునీల్‌రావు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తారని కొంత కాలంగా ప్రచారం జరుగుతున్నది. పలు సందర్భాల్లో కరీంనగర్ కార్పొరేషన్ స్మార్ట్‌సిటీగా రూపుదాల్చడానికి కర్త, కర్మ, క్రియ బండి సంజయ్‌కుమార్ అంటూ సునీల్‌రావు ప్రసంగించడం మొదటి నుంచి తాను వెన్నంటి ఉంటూ వస్తున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పాత్రను విస్మరించడం బీఆర్‌ఎస్‌లో కలకలం సృష్టించింది. అప్పటి నుంచే ఆయనను బీఆర్‌ఎస్ అనుమానిస్తూ వస్తున్నది. వినోద్‌కుమార్ వర్గీయులు కూడా మేయర్‌ను వ్యతిరేకిస్తూ వస్తున్నారు. మేయర్ సునీల్ రావు ముఖ్యమైన సమావేశాల్లో తప్ప ఇతర కార్యక్ర మాల్లో అంత చురుగ్గా పాల్గొనకుండా స్పష్టమైన గ్యాప్ కనిపించేలా వ్యవహరిస్తూ వచ్చారు.అయన మాత్రమే కాకుండా బీఆర్‌ఎస్ నుంచి మెజార్టీ కార్పొరేటర్లను పార్టీ మార్పించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ కార్యాచరణ రూపొందించి సునీల్‌రావుకు అప్పగించారు. తొలుత 16 మంది కార్పొరేటర్లు బీఆర్‌ఎస్‌కు తిలోదకాలిస్తారని భావించారు. అయితే స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ కొందరిని బుజ్జగించి పార్టీ వీడకుండా ఒప్పించగలిగారని, దీనితో సునీల్ రావుతో 10 మంది కార్పొరేటర్లు మాత్రమే బీజేపీలో చేరుతున్నారని తెలుస్తున్నది. ఈ నెల 28తో కరీంనగర్ కార్పొరేషన్ పాలకవర్గ పదవీకాలం ముగి యనుండడంతో ఆలోగానే బీఆర్‌ఎస్‌కు తమ రాజీనామాలతో షాక్ ఇస్తున్నారు.

- కరీంనగర్‌లో అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే శక్తి, అండదండలు అవసరమని, అందుకే భారతీయ జనతా పార్టీలో చేరుతున్నానని సునీల్‌రావు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నగర ప్రజలు తనకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు.

బాలుడిపై లైంగిక దాడి?

వేములవాడ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల బాలుడిపై 14ఏళ్ల బాలుడు లైంగికదాడికి పాల్పడినట్లు తెలిసింది. వేములవాడ మున్సిపల్‌పరిధిలోని ఓ కాలనీకిచెందిన బాలుడిపై గురువారం సాయంత్రం అదేకాలనీకి చెందిన 14ఏళ్ల బాలుడు అఘాయిత్యానికి పాల్పడడంతో బాలుడికి తీవ్ర రక్తస్రావమైంది. విషయం తల్లిదండ్రులకు తెలియడంతో బాలుడిని ఆసుపత్రికి తరలించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

ఇల్లంతకుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో మండలంలోని అనంతగిరి గ్రామానికి చెందిన వెదిరె పరశురాంను అరెస్టు చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి శుక్రవారం పేర్కొన్నారు. సీఐ తెలిపినవివరాల ప్రకారం.. కరీంనగర్ జైలులో జీవితఖైదు శిక్ష అనుభవిస్తున్న పరశురాంకు కరీంనగర్‌కు చెందిన బాధితురాలితో పరిచయం ఏర్పడింది. గతనెల 24న పెరోల్‌పై బయటకు వచ్చిన పరశురాం కరీంనగర్‌లో ఉన్న బాధితురాలి వద్దకు వెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈనెల 20న బాధితురాలిని తన ద్విచక్రవాహనంపై కరీంనగర్ నుంచి అనంతగిరి గ్రామానికి తీసుకవెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం పెద్దలింగాపూర్ గ్రామం వైపు ద్విచక్రవాహనంపై తీసుకొని వెళుతుండగా బాధితురాలు కేకలు వేయగా పరశురాం పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శుక్రవారంఅనంతగిరి గ్రామసమీపంలో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడిపై గతంలో హత్య కేసుఉండగా జీవితఖైదు అనుభవిస్తున్నట్లు సీఐ తెలిపారు. సీఐ వెంట ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్‌తోపాటు పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

భీమారం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలకేంద్రానికి చెందిన చెరుకూరి లక్ష్మి(52) అనే మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. లక్ష్మి కొన్నిరోజుల నుంచి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన లక్ష్మి శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు లక్ష్మి కూతురు గుడ్ల స్వప్న ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యామ్‌రాజు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు సంతానం కాగా అందరికీ వివాహాలు అయ్యాయి. కొడుకు ప్రస్తుతం గల్ఫ్ దేశంలో ఉంటున్నాడు.

విచ్చలవిడిగా గంజాయి



- వాట్సప్ గ్రూపుల ద్వారా అమ్మకాలు

జమ్మికుంట రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంతోపాటు మండల వ్యాప్తంగా గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. గడిచిన ఏడాది కాలంలో గంజాయి విక్రయిస్తూ పోలీసులకు చిక్కిన వారిలో మహిళలు ఎక్కువగా ఉండడం విశేషం. మహిళల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని గంజాయి ముఠాలు వారిని ఈ ఊబిలోకి దింపుతున్నాయి. మహారాష్ట్ర నుంచి రైలు మార్గంలో వస్తువుల మధ్య గంజాయి ప్యాకెట్లు పెట్టి జమ్మికుంట రైల్వే స్టేషన్‌కు తీసుకు వస్తున్నారు. రైల్వే స్టేషన్‌ను ఆనుకొని ఉన్న కొత్తపల్లి నుంచి ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది.



- మత్తుతో చిత్తు అవుతున్న యువత..

గంజాయి మత్తుకు ఎక్కువగా యువకులు బానిసలవుతున్నారు. వారిలో ఎక్కువగా 18 నుంచి25ఏళ్ల మధ్య వయస్సు వారు ఉంటున్నారు. మొదట సిగరెట్లకు అలువాటు పడుతున్న యువత తర్వాత గంజాయి వైపు మరలుతున్నారు. నిర్మానుష్య ప్రాంతాలను అడ్డాగా చేసుకుని గంజాయి సేవిస్తున్నారు. మొదట సిగిరేట్ ప్యాకెట్లు కొనుగోలు చేసి, అందులోని పొగాకు బయటకు తీసి గంజాయితో నింపి సేవిస్తున్నారు.గంజాయి కొనుగోలు చేసే వ్యక్తుల కోసం ప్రత్యేకంగా వాట్సప్ గ్రూప్‌లు ఏర్పాటు చేశారు. తమకు ఎంత మేరా గంజాయి కావాలో గ్రూపులో పోస్ట్ చేస్తే సదరు అడ్రస్‌కు క్షణాల్లో గంజాయిని చేర్చుతున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా ఇందుకు ఖరీదైన బైక్‌లు వాడుతున్నారు.

- గంజాయి సేవించి వింత ప్రవర్తన..

తక్కువ ధరకు ఎక్కువ కిక్కు ఇస్తుండడంతో యువత గంజాయి వైపు ఆకర్షితులవుతున్నారు. గంజాయి సేవించిన తర్వాత వారి ప్రవర్తన వింతగా మారుతోంది. బైకులపై అతి వేగంగా ప్రమాదాలకు కారణమవుతున్నారు.

నిందితుడికి ఆరు నెలలు జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు కేసుల్లో నిందితుడు అశోక్‌కు ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.100జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల సీఐ కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పట్టణం బీవై నగర్‌కు చెందిన ఎం భాస్కర్ అనే వ్యక్తి బైక్‌పై రాజీవ్‌నగర్ నుంచి బీవైనగర్ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న సిరిసిల్ల పట్టణం సంజీవయ్యనగర్‌కు చెందిన యాలకుల అశోక్ అనే వ్యక్తి ఢీకొన్నాడని ఆయన తెలిపారు. దీంతో అశోక్, భాస్కర్‌తో గొడవ పడుతూ తాను పోలీసునని, తన మోటార్‌సైకిల్‌తో ఢీకొంటావా అంటూ రూ.3వేలు జరిమానా కట్టమని భాస్కర్‌ని బెదిరించాడన్నారు. డబ్బుల్లేవని బతిమిలాడినా వదలకుండా బలవంతంగా అశోక్ అనేవ్యక్తి భాస్కర్ ఏటీఎం కార్డు తీసుకొని డ్రాచేసుకున్నాడని ఆయన తెలిపారు. కొద్దిసేపటి తరువాత అతను పోలీస్ కాదని, డ్రైవర్ అని తెలుసుకొని భాస్కర్ అనేవ్యక్తి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు నమోదు చేసి విచారణ అనంతరం అప్పటి ఎస్‌ఐ బి శ్రీనివాస్ అరెస్ట్ చేసి రిమాండ్ చేశారన్నారు. మరోదొంగతనం కేసులో అశోక్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధించారని ఆయన తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుడికి ఏడు నెలలు..

ఇల్లంతకుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలోని ఎల్లమ్మ గుడి ఆలయంలో జరిగిన దొంగతనం కేసులో సూర దేవేందర్ అనే నిందితుడికి సిరిసిల్ల రెండవ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి గడ్డం మేఘన జైలుశిక్ష విధించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. రెండు సంవత్సరాల క్రితం రేణుకాదేవి ఆలయంలో హుండీని పగలగొట్టి దేవేందర్ నగదు ఎత్తుకెళ్లాడు. కోర్టులో నేరం నిరూపణ కావడంతో న్యాయమూర్తి 17 నెలల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

ఇల్లందకుంట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన చందగల్ల సాంబయ్య(60) చికిత్సపొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారుతెలిపిన వివరాల ప్రకారం.. మృతుడికి సరిగా మతిస్థిమితంలేదు. ఈ నెల20న ఇంట్లో ఎవరూలేని సమయంలో మద్యంతాగి, తలుపులు పెట్టుకొని ఇంటికి నిప్పటించాడు. దీంతో సాంబయ్యకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు మంటలను ఆర్పిఅతనిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు.చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్సపొందుతూ వృద్ధురాలు మృతి



మృతి చెందిన సావిత్రి

కరీంనగర్ అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కరీం నగర్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సావిత్రి(60) అనే వృద్ధురాలు మృతిచెందిందని అవుట్‌పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపారు. రామ గుండం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి గురువారం 108సిబ్బంది అంబులెన్స్‌లో సావిత్రిని తీసుకొచ్చి కరీంనగర్ ప్రభుత్వాస్పత్రిలో అడ్మిట్ చేశారు. సావిత్రికి సంబంధించిన వారు ఎవరూ లేరని, ఆమెను గుర్తించినవారు కరీంనగర్ ప్రభుత్వాస్ప త్రిలోని అవుట్‌పోస్ట్ పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి



గౌతమి (ఫైల్)

తిమ్మాపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూరు శివారు మానకొండూరు వెళ్లే రహదారిపై గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో మహిళ మృతిచెందగా మృతురాలి భర్తకు గాయాలయ్యాయి. ఎల్‌ఎండీ ఎస్‌ఐ వివేక్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూరు మండలం అన్నారం గ్రామానికి చెందిన రుద్రోజు శ్రీనివాసచారి తన భార్య గౌతమి(30) వారి ఇద్దరు చిన్నపిల్లలు పాప రసజ్ఞ(3), బాబు రుద్రాంష్ (8నెలలు)తో కలిసి పనినిమిత్తం కరీంనగర్‌కు వారి ద్విచక్రవాహనం (టిఎస్02ఎఫ్‌బి 6995)పై వెళ్లారు. పని ముగించుకుని తిరిగి అన్నారంకు బయలుదేరి వెళుతుండగా అలుగునూరు శివారులోని లక్ష్మినరసింహా ఫంక్షన్‌హాల్ సమీపంలో గుర్తుతెలియని వాహనం వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుకనుంచి ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ సంఘటనలో ద్విచక్రవాహనంపై వెనకాల కూర్చున్న గౌతమి కిందపడిపోగా ఆమె తలపై నుంచి వాహనం వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త శ్రీనివాస్‌చారికి కాళ్లకు, చేతులకు గాయాలయ్యాయి. పిల్లలు మాత్రం ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డారు. శ్రీనివాసచారిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్‌ఎండీ ఎస్‌ఐ వివేక్ తెలిపారు.

సైదాపూర్ మండలంలో ఒకరు..

సైదాపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని ఘణపూర్ గ్రామానికి చెందిన గుంటి శ్రీనివాస్(38) గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ దుద్దెనపల్లిలోని తన బంధువులు మృతి చెందగా, అంత్యక్రియలకు తన ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో దుద్దెనపల్లి, సైదాపూర్ మధ్య గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అనారోగ్యంతో ఒకరు..

హుజూరాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో శుక్రవారం గణేష్‌నగర్‌కు చెందిన సోయం రాజు(30) అనే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందినట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు. గణేష్‌నగర్‌కు చెందిన రాజు ఐదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికితోడు అతడు మద్యానికి బానిసవగా శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

మండల సరిహద్దులో పులి సంచారం..

- రాత్రి వేళల్లో రైతులు పొలాల వద్దకు వెళ్లవద్దు

చందుర్తి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాలమండల సరిహద్దుల నుంచి చందుర్తి మండల సరిహద్దుల్లో పులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించినందున మండల రైతులు, గొర్రెలకాపర్లు అప్రమత్తంగా ఉండాలని చందుర్తి ఎస్‌ఐ అంజయ్య, అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రాఘవేందర్‌రావులు శుక్రవారం తెలిపారు. కొడిమ్యాల మండలంలోని కొండాపూర్ శివారులో పులి ఓ ఆవును చంపిందని, మండలంలోని తిమ్మాపూర్, రామన్నపేట, నర్సింగాపూర్ గ్రామాల శివారులో సంచరిస్తోందన్నారు. రాత్రి సమయంలో రైతులు పొలాల వద్దకు వెళ్లకూడదని, మధ్యాహ్నా సమయంలో కూడా ఒంటరిగా వెళ్లకూడదన్నారు. రాత్రి సమయంలో పొలాల వద్ద ఎలాంటి విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయకూడదన్నారు. ఎలాంటి సమాచారం తెలిసినా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లోని ఆవునూర్ మూలమలుపు వద్ద శుక్రవారం ఇసుక ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో వెంకటాపూర్, ముస్తాబాద్ మండలం ఆవునూర్ గ్రామాలకు చెందిన నర్సయ్య, సురేశ్‌లు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నర్సయ్య, సురేశ్‌లు తమ ద్విచక్రవాహనంపై వెంకటాపూర్ నుంచి ఆవునూర్ వైపు వెళుతున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ అతివేగంగా ఢీకొట్టింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ బస్టాండు ప్రాంతంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గురువారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన హీక్యానాయక్ తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. హీక్యానాయక్ తన ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో కామారెడ్డి నుంచి ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం హీక్యానాయక్‌ను ఢీకొట్టింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

అనారోగ్యంతో ఎంఈవో మృతి

ఎల్లారెడ్డిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఈసరి రవీందర్(57) అనారోగ్యంతో వరంగల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. రవీందర్ కొంతకాలంగా మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతున్నారు. పరిస్థితి విషమంగా మారడంతో వరంగల్‌కు తరలించగా చికిత్స పొందుతూ చనిపోయారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన ఎల్లారెడ్డిపేటకు తీసుకురావడంతో స్థానికంగా విషాదం నెలకొంది. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

పోరాట యోధుడు సర్వాయి పాపన్న

- పాపన్న చరిత్ర దేశానికి చాటిచెప్పేలా పాపన్న గుట్టల అభివృద్ధి
- సర్వాయిపాపన్న నివసించిన ప్రాంతం సర్వాయిపేటను పర్యాటక కేంద్రంగా మారుస్తాం
- పాపన్న గుట్టల అభివృద్ధికి త్వరలోనే మరిన్ని నిధులు
- సైదాపూర్ మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్



సర్వాయి పాపన్న కోట అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సైదాపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని రాష్ట్రరవాణా, బీసీసంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఆయన సైదాపూర్ మండలం సోమారం గ్రామశివారులోని మోడల్‌స్కూల్‌ను సందర్శించారు. స్కూల్ అభివృద్ధికి రూ.60లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రహరీ కోసం రూ. 48లక్షలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.12లక్షలు మంజూరు చేస్తానన్నారు. వెన్నంపల్లిలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయసహకార సంఘం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం సర్వాయిపేట శివారులోని కొమ్ము గుట్ట వద్ద ఉన్న సర్వాయిపాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్వాయి పాపన్న గుట్టలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మంజూరు చేసిన రూ.4.70కోట్ల నిధులతో చేపట్టే పనుల ప్రారంభానికి శంకుస్థాపన, భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో మంత్రి పొన్నంప్రభాకర్ మాట్లాడుతూ సర్ధార్‌సర్వాయి పాపన్న చరిత్రను దేశానికి చాటి చెప్పేలా పాపన్న నివసించిన ప్రాంతాన్ని అభివృద్ధిచేసి, పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుతామన్నారు. ప్రస్తుతానికి సర్వాయిపేటగ్రామంలో సర్వాయిపాపన్న కోట అభివృద్ధికి మంజూరు చేసిన రూ.4.70కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. త్వరలోనే ఈ ప్రాంతం అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేస్తామన్నారు. సర్వాయిపేట కోట పనులు పూర్తయ్యాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రారంభోత్సవం చేయిస్తామన్నారు. మరిన్ని నిధులతో మరోదశ అభివృద్ధిని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలాసత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, ట్రైనీకలెక్టర్ అజయ్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, సహకార సంఘాల అధ్యక్షులు కొత్త తిరుపతిరెడ్డి, వెంకటొరెడ్డి, తెలంగాణగౌడ సంఘం అధ్యక్షుడు భువనగిరి యాదగిరిగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూ వ్యవహారంలో బెదిరింపులకు పాల్పడిన ముగ్గురి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): విక్రయించిన భూమిని తిరిగి అప్పగించాలని బెదిరింపులకు పాల్పడిన సిరిసిల్ల పట్టణంలోని బి.వై.నగర్‌కు చెందిన దండుగుల రాజు(48)తో పాటు కోనరావుపేట మండలంలోని నిజామాబాద్ గ్రామానికి చెందిన మెరుగు లక్ష్మన్(48), కోనరావుపేటకు చెందిన ముదాం ప్రసాద్(46) అనే ఇద్దరు మాజీనక్సలైట్‌లను శుక్రవారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని వెంకటేశ్వర టెంపుల్ వీధికి చెందిన మర్రిపల్లి శ్రీనివాస్, అతడి సోదరులు కలిసి 2016లో స్థానిక నెహ్రూ నగర్‌కు చెందిన నక్కరాజు వద్ద పెద్దూరు శివారులోని సర్వేనంబర్ 55జీలో 3.16ఎకరాల భూమిని కొనుగోలుచేసి వ్యవసాయం చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. 2015లో దండుగుల యాదమ్మ వద్ద నక్కరాజు అనే వ్యక్తి అట్టి భూమి కొనుగోలు చేయగా తర్వాత ధర పెరగడం వల్ల వారు అమ్మిన భూమిని ఎలాగైనా దక్కించుకోవాలనే ఉద్దేశ్యంతో మర్రిపల్లి శ్రీనివాస్‌ను ఎంత బెదిరించినా భయపడక పోవడంతో దండుగుల రాజు మాజీ నక్సలైట్ మెరుగు లక్ష్మన్, ముదాం ప్రసాద్‌లతో కుమ్మక్కై వారిని బెదిరించి భూమి లాక్కొని సగం సగం తీసుకోవాలని ప్రయత్నించారని తెలిపారు. ఇదే క్రమంలో పలుమార్లు శ్రీనివాస్‌ను బెదిరించి దౌర్జన్యంగా ఆక్రమించుకోవాలని చూడగా అప్పటికే దండుగుల రాజు, అతని తల్లి యాదమ్మ, భార్య లక్ష్మిలపై ఐదు కేసులు నమోదు అయ్యాయని ఆయన తెలిపారు. అయినప్పటికీ మర్రిపల్లి శ్రీనివాస్ భూమిని లాక్కోవాలనే ఉద్దేశ్యంతో జనవరి19న చంపుతామని బెదిరించారని, అంతేకాకుండా నక్కరాజు వద్ద రూ.16 లక్షల అప్పు తీసుకొని దానికి బదులుగా 3.16 ఎకరాల భూమి కుదువ పెట్టినట్లుగా తప్పుడు పత్రాలు సృష్టించి దానిని చూపిస్తూ భూమి తమ వారిదేనని బెదిరించారని ఆయన తెలిపారు. శ్రీనివాస ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి ముగ్గురు నిందితులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ అమలుకు ఇదే అసలైన సమయం

- ఎవరు అడ్డుపడినా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సాధిద్దాం
- ఇంటికో డప్పుతో కదలండి.. విజయవంతం చేయండి..
- ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో లక్ష డప్పులు మోగిద్దాం..
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



ర్యాలీలో డప్పు కొడుతున్న మందకృష్ణ మాదిగ

సిరిసిల్ల క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల వర్గీకరణ అమలుకు ఇదే అసలైన సమయమని, ఎవరు అడ్డుపడినా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సాధిద్దామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని కె కన్వెన్షన్‌లో 'లక్ష డప్పులు... వేల గొంతుల కార్యక్రమానికి తరలి రండి' సభ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొనపురం లక్ష్మణ్ మాదిగ అధ్యక్షతన భారీసభ నిర్వహించారు. ముందుగా సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి మందకృష్ణ మాదిగ పూలమాలలు వేసి, అంబేద్కర్ చౌరస్తా నుంచి కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వరకు డప్పు చప్పుళ్లతో భారీర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు... వేలాది గొంతులు అనే కార్యక్రమానికి ప్రతి ఇంటి నుంచి డప్పులతో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. డప్పులు లేకుండా రావద్దన్నారు. ఈ మహత్తర సాంస్కృతిక కార్యక్రమంపై ప్రపంచమే మనవైపు ఎదురు చూస్తోందన్నారు. ఎస్సీ వర్గీకరణ ఇపుడు అమలు చేయకపోతే ఎపుడూ చేయలేమన్నారు. ఎస్సీలలో 58కులాలు ఒక వైపు ఉంటే ఒకే ఒక్క మాలలు మరోవైపు ఉన్నారన్నారు. ప్రతి 100మందిలో 80మంది మాదిగలుంటే 20మంది మాలలు ఉన్నారన్నారు. ఈ విధంగా రిజర్వేషన్లలోనూ అన్యాయం జరుగుతోందన్నారు. చెప్పులు కుట్టి, డప్పులు కొట్టి మాదిగలు సమాజానికి సేవ చేశారని, సాంప్రదాయ వాయిద్యంగా డప్పు చూసి గర్వపడాలన్నారు. ప్రతి ఇంటిలో డప్పులు ఉండాలని, ప్రతి మాదిగ బిడ్డ వెంటనే డప్పుకొని ఇంట్లో పెట్టుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం సాధించిన విజయఫలాలను మాదిగ బిడ్డలకు చేరకుండా మాలల వర్గం కుట్రలు చేస్తోందన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఆగస్టు 1న ఏడుగురు జడ్జీల ధర్మాసనంలో ఆరుగురు జడ్జీలు అనుకూలంగా ఉండి రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉందని తీర్పు ఇచ్చిందన్నారు. నాలుగు నెలలైనా తెలంగాణలో అమలు చేయడంలేదని, తీర్పువచ్చిన రోజు అసెంబ్లీలో సీఎం అనుకూలంగా మాట్లాడారన్నారు. ఎస్సీ వర్గీకరణకు మాలల వర్గమే అడ్డుపడుతోందన్నారు. కార్యక్రమంలో ఉద్యమనాయకులు దరువు అంజన్న, ఏపూరి సోమన్న, భరత్, అశోక్, సంజీవ్ తదితర కళాకారులు డప్పు చప్పుళ్లు, ఆట పాటలతో హోరెత్తించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాసు, సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఆవునూరి ప్రభాకర్, అంకని బాను, ధామస్, ఎంఎస్‌పీ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటస్వామి మాదిగ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రుద్రారపు రాంచంద్రం మాదిగ, సత్యనారాయణ, బాలరాజు, లక్ష్మన్, దేవయ్య, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చంపుతామని బెదిరించిన ఇద్దరి అరెస్టు

వేములవాడ రూరల్, జనవరి24 (ఆంధ్రజ్యోతి): చంపుతామని బెదిరించిన ఇద్దరిని అరెస్టుచేసి రిమాండుకు తరలించినట్లు రూరల్‌సీఐ శ్రీనివాస్ తెలిపారు. సీఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. బోయినిపల్లి గ్రామానికిచెందినశ్రీనివాస్ హోటల్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. కూతురి వివాహం నిశ్చయం కావడంతో డబ్బు అవసరమై తన ఇంటిని అమ్మదలచి ఓ విలేకరి సహాయం కోరాడు. అతడు వేములవాడకు చెందిన కడారి తిరుపతి అనే రౌడీషీటర్‌ను శ్రీనివాస్ దగ్గరకు తీసుకువచ్చి ఇల్లు కొనడానికి రూ.50వేలు అడ్వాన్స్‌గా ఇచ్చి ఒప్పందం చేసుకున్నారు. తర్వాత డబ్బులు పూర్తిగా చెల్లించకుండానే చంపుతానని బెదిరించి ఇంటి ఒరిజినల్ డాక్యుమెంట్లను తిరుపతి తీసుకెళ్లడంతో బాధితుడు శ్రీనివాస్ బోయినిపల్లి పోలీసులను ఆశ్రయించాడు. దీంతోపోలీసులు కడారి తిరుపతి, పత్రికా విలేకరిని పట్టుకుని వారి వద్ద నుంచి ఇంటిపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టుచేసి రిమాండుకు తరలించినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గంగాధర, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మధురానగర్‌లో పేకాట రాయుళ్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. మధురానగర్‌శివారులోని మామిడి తోటలో పేకాడుతున్నారని పక్కాసమాచారం మేరకు దాడిచేసినట్లు తెలిపారు. ఈదాడిలో 8మంది పేకాడుతుండగా పట్టుబడినట్లు ఆయన తెలిపారు. వారినుంచి రూ.20,500లు, 7సెల్‌ఫోన్లు, 4బైకులను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

'పొలాస'లో రైతులకు శిక్షణ


జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొలాసలో శుక్రవారం యాసంగి వరిలో ప్రధాన సమస్యలు, యాజమాన్య పద్ధతులపై రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లా డుతూ వరిలో మొగిపురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3సీజీ ఎకరానికి 10కిలోల చొప్పున 20-25 కిలోలు ఇసుకను కలుపుకొని బురద పదనలో చల్లాలన్నారు. ఈ సమావేశంలో పరిశోధన స్థానం ఏడీఆర్ శ్రీనివాస్, శాస్త్రవేత్తలు బలరాం, స్వాతి, సాయినాథ్, రజినీకాంత్, మదన్‌మోహన్‌రెడ్డి, రజినీదేవి, శ్రీలక్ష్మి, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల రైతులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు శుక్రవారం కరీంనగర్‌లోని అంబేద్కర్ ప్రభుత్వ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని 10 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 600 మంది విద్యార్థులు హాజరయ్యారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ అప్పారవు, డాక్టర్ రాజగోపాల్, అంబేద్కర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, సిరిసిల్ల పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్ పరీక్షలు

తిమ్మాపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ తొలివిడత ఆన్‌లైన్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని ఐయాన్ డిజిటల్ జోన్, శ్రీచైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్, కరీంనగర్‌లోని వాణినికేతన్ డిగ్రీఅండ్‌పీజీ కళాశాలలో మొత్తం కలిపి నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నాలుగు పరీక్షా కేంద్రాల్లో కలిపి మొదటి సెషన్‌లో 967 మంది అభ్యర్థులకు 946మంది హాజరు కాగా 14మంది గైర్హాజరు అయ్యారు. రెండు సెషన్‌లలో కలిపి 1926మంది విద్యార్థులకు గాను 1891మంది హాజరు కాగా 35మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాలేదని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ టి లలిత కుమారి తెలిపారు.



● 40 ఎకరాల్లో ఐలాండ్ అభివృద్ధికి మోక్షం కలిగేనా...?

ఇల్లంతకుంట మండలం అనంతగిరి వద్ద గుట్టలను అనుసంధానం చేస్తూ అన్నపూర్ణ, అనంతగిరి ప్రాజెక్టును నిర్మించారు. ఇక్కడే ఆసియాలోనే అతిపెద్ద సర్జ్ పూల్ బావిని కూడా నిర్మించారు. ప్రాజెక్టులో మధ్యలో ఉన్న 40 ఎకరాలతో ఉన్న గుట్టను ఐలాండ్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించినా ప్రతిపాదనలకు మోక్షం కలగడం లేదు. ప్రాజెక్ట్ వద్ద సిరిసిల్ల, కరీంనగర్, సిద్దిపేట జిల్లాల ప్రజలకు ఎంతో ఇష్టమైన పోచమ్మ తల్లి దేవాలయం కూడా ఉంది. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఇక్కడికి వచ్చే పర్యాటకులు, వేములవాడకు వచ్చే యాత్రికులకు ప్రాజెక్ట్ ఎంతో ఆహ్లాదాన్ని పంచుతుందని భావిస్తున్నారు.

పర్యాటక శోభ ఏదీ?

- ధార్మిక, కార్మిక క్షేత్రానికి... పర్యాటక సొబగులు
- టెంపుల్ టూరిజం వైపు అడుగులు
- ప్రారంభోత్సవానికే పరిమితమైన మిడ్ మానేరు జల విహారం
- అనంతగిరి ప్రాజెక్టులో 40 ఎకరాల్లో ఐలాండ్

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కార్మిక, కర్షక, ధార్మిక ఆధ్యాత్మిక జిల్లాగా రాజన్న సిరిసిల్ల నిలుస్తోంది. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నా పర్యాటకులకు నిరాశే కలుగుతోంది. దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న జిల్లాలోని వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. టెంపుల్ టూరిజానికి అవకాశం ఉన్నా గత ప్రభుత్వ హయాంలో అడుగులు పడలేదు. ప్రతిపాదనలకే పరిమితం అయ్యాయి. గత సంవత్సరం నవంబరులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి శంకుస్థాపనలతో అతిపెద్ద శైవక్షేత్రంగా పేరొందిన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానాన్ని అద్భుతమైన రీతితో తీర్చిదిద్దేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. గత ప్రభుత్వ హయాంలో భారీ నిధులతో అభివృద్ధి చేస్తామన్న హామీలు కాగితాల మీద డిజైన్లుగా మాత్రమే ఆకర్షించాయి. కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సమయంలో పీసీసీ అధ్యక్ష హోదాలో రేవంత్‌రెడ్డి వేములవాడ రాజన్నను దర్శించుకొని అభివృద్ధి చేస్తామని మాట ఇచ్చారు. మాటకు కట్టుబడి అధికారంలోకి రావడంతోనే బడ్జెట్‌లో రూ.50 కోట్లు నిధులు పొందుపర్చారు. దానికి అనుగుణంగానే వేములవాడలో ఇతర అభివృద్ధి పనులు దేవస్థానం ఆలయ విస్తరణకు రూ.127.65 కోట్లు మంజూరు చేస్తూ జీవోలు జారీ చేశారు. దీంతో పాటు భక్తులకు, పర్యాటకుల కోసం అన్నదాన సత్రం కూడా నిర్మిస్తున్నారు.

● ఎదురు చూపుల్లోనే... జల విహారం

శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్, అనంతగిరి ప్రాజెక్ట్, ఎగువ మానేరు ప్రాజెక్టుల వద్ద పర్యాటక హంగులు కల్పించే దిశగా గత ప్రభుత్వం హడావిడి చేసినా పర్యాటకులకు జల విహారం ఎదురుచూపులే మిగిల్చింది. శాసనసభ ఎన్నికల సమయంలో శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కరకట్ట వద్ద అప్పటి మంత్రులు బోటును ప్రారంభించి జలవిహారానికి నాంది పలికినా ప్రారంభోత్సవం తోనే నిలిచిపోయింది. దాదాపు మూడు సంవత్సరాలుగా సిరిసిల్ల ప్రజలు జలవిహారానికి ఎదురుచూసినా నిరాశపర్చింది. ఇప్పటికీ ప్రారంభించిన బోట్లు కరకట్ట వద్ద వెక్కిరిస్తూ కనిపిస్తున్నాయి. జిల్లాలోని మిడ్‌మానేరు, అన్నపూర్ణ రెండు ప్రాజెక్టులు పర్యాటకానికి కీలకంగా మారుతాయని భావించారు. దక్షిణ కాశీగా వేముడాడల శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ప్రసిద్ధి చెంది ఆధ్యాత్మికతకు పర్యాటకం తోడవుతుందని అనుకున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకాలకు సిరిసిల్ల మానేరు తీరంలోని శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ అనంతగిరి ప్రాజెక్టులు ప్రధానంగా నిలుస్తాయి. ఈ ప్రాజెక్టుల వద్ద పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని 2021 జూలై 4న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అనంతగిరి పోచమ్మను దర్శించుకుంటానని అన్నపూర్ణ అనంతగిరి, శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులను పర్యాటక అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. వేములవాడ ఆధ్యాత్మికతకు స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు పర్యాటకం కూడా స్వాగతం పలుకుతుందని భావించినా ఆచరణలోకి మాత్రం రాలేదు. మిడ్ మానేరు వద్ద కొడుముంజ గుట్టలకు కలుపుకొని రోప్‌వేలు, కాటేజ్‌ల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. అదేక్రమంలో మిడ్ మానేరు బ్యాక్ వాటర్ సిరిసిల్ల కరకట్ట వద్ద బోటును కూడా సిద్ధం చేసినా కొవిడ్‌తో ప్రారంభానికి నోచుకోలేదు. శాసనసభ ఎన్నికల క్రమంలో గత సంవత్సరం ఆగస్టు 18న హడావిడిగా, నామామాత్రంగా ప్రారంభోత్సవం చేసి వదిలేశారు.


అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లో మత్స్యకారులు (ఫైల్)



- స్టూడెంట్... టూరిజం
- తెలంగాణ దర్శిని పేరుతో పర్యాటక ప్రాంతాల సందర్శన
- నేడు జాతీయ పర్యాటక దినోత్సవం

ప్రతి యేడాది జనవరి 25న దేశ వ్యాప్తంగా పర్యాటక దినోత్సవం జరుపుకుంటారు. భారతదేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సంప్రదాయ విలువల అభివృద్ధికి పర్యాటక రంగం తోడ్పడాలని టూరిస్ట్ ట్రాఫిక్ కమిటీ స్థాపించిన సందర్భంగా 1948 నుంచి జాతీయ పర్యాటక దినోత్సవాన్ని జరుపుతున్నారు. పర్యాటక రంగంలోని విభిన్న సంస్కృతులను ప్రోత్సహించడం, ఆయా పర్యాటక ప్రాంతాలను ప్రపంచానికి పరిచయం చేయడం, పర్యాటక ప్రాముఖ్యతను పెంచడమే లక్ష్యం.

సిరిసిల్ల/కరీంనగర్ కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) :దేశంలోని వివిధ ప్రాంతాలను, అక్కడి సంస్కృతులను తెలుసుకునేందుకు స్టూడెంట్ టూరిజంను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ విద్యా సంవత్సరం తెలంగాణ దర్శిని పేరిట పర్యాటక ప్రాంతాల సందర్శనకు అవకాశం ఇచ్చింది. ప్రభుత్వమే విహార యాత్రలకు అయ్యే ఖర్చులు భరిస్తుంది.

● పాఠశాలలో టూరిజం క్లబ్‌లు..

పాఠశాలల్లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం యువ టూరిజం క్లబ్‌లను కూడా ఏర్పాటు చేయనుంది. 7వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకునే విద్యార్థులకు టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ప్రతి క్లబ్‌లో 25 మంది విద్యార్థులను సభ్యులుగా ఏర్పాటు చేస్తారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తూ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడే లక్ష్యంగా క్లబ్‌లు పనిచేసే విధంగా చూస్తారు. క్లబ్‌ల ద్వారా విద్యార్థి స్థాయి నుంచే సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించనున్నారు.

● పర్యాటక, విజ్ఞాన విహార కేంద్రాలు

మిడ్ మానేరు ప్రాజెక్ట్, ఎగువ మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ ప్రాజెక్ట్, అర్బన్ పార్కులు, దిగువ మానేరు డ్యాం, ఉజ్వల, డీర్ పార్క్‌లు, ఎన్‌టీపీసీ రామగుండం, రామగిరి, ఎలగందుల, మొలంగూర్, కోటి లింగాల, జగిత్యాల, నగునూరు, మానకొండూరు కోటలు, సర్వాయి పాపన్న గుట్టలు, ధూళికట్ట బౌద్ధక్షేత్రం, వేములవాడ, గుండారం, బోల్, బుగ్గ, అక్కపల్లి, తోటపల్లి, మానకొండూరు, కొత్తపల్లి చెరువులు, కరీంనగర్ మ్యూజియం చూడదగ్గ ప్రాంతాలు. పొరుగు జిల్లాలోని బాస ర, అలీసాగర్, బోటానికల్ గార్డెన్, కోమటి చెరువులాంటి ప్రాం తాలను చూసే అవకాశం విద్యార్థులకు లభిస్తుంది.

పెద్దపులి సంచారంపై పరిశీలన

● నాలుగు బృందాల ఏర్పాటు

కొడిమ్యాల, జనవరి24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్‌లో ఆవుపై పెద్దపులి దాడి చేసి చంపడంతో అధికారులు, సిబ్బంది నాలుగు బృందాలుగా అటవీ ప్రాంతంలో పరిశీలిస్తున్నారు. పెద్దపెల్లి అటవీ కార్యాలయం నుంచి తీసుకొచ్చిన నాలుగు కెమెరా ట్రాప్‌లను కొండాపూర్ శివారు ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్ మాట్లాడారు. కారిడార్ ఆధారంగా ఎస్ 12 అనే పెద్దపులి సిర్పూర్ నుంచి ఖానాపూర్ మీదుగా ఈ నెల 22న రాత్రి కొండాపూర్ అటవీ ప్రాంతానికి చేరుకున్నట్లు భావిస్తున్నామన్నారు. పెద్దపులి ఒక రోజులో నాలుగు దిక్కుల్లో 25 కిలోమీటర్ల చొప్పున 100 కిలోమీటర్ల పరిధిలో తిరుగుతుందని, ఆవాసాన్ని ఏర్పాటు చేసుకొని ఉండడానికి ప్రయత్నిస్తుందని, లేదా ఆ ప్రదేశం నుంచి వెళ్లిపోతుందని తెలిపారు. పెద్దపులి సంచారంతో వేములవాడ మండలం ఫాజుల్‌నగర్ నుంచి కొండాపూర్, కొడిమ్యాల నుంచి కోనాపూర్, కోనాపూర్ నుంచి దమ్మయ్యపేట, దమ్మయ్యపేట నుంచి నూరంపేట అటవీ ప్రాంతాల్లో


అడవిలో పరిశీలిస్తున్న సిబ్బంది

పొలాల వద్దకు వెళ్లే రైతులను, పశువుల కాపరులను అప్రమత్తం చేస్తున్నట్లు చెప్పారు. పంట రక్షణ కోసం ఎవరైన ఉచ్చులు, విద్యుత్ తీగలు, ఉరులు ఏర్పాటు చేస్తే తొలగించాలన్నారు. రాత్రి పూట బయటకు రావద్దని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. డీఆర్వోలు ముషీర్ అహ్మద్ మోనిక, సెక్షన్ ఆఫీసర్లు రత్న, సుబ్బారావు ఉన్నారు.

● రక్షణ కోసం కర్రతో పొలాలకు వెళ్లండి


రేంజర్ మొయినుద్దీన్

కొడిమ్యాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : అటవీ ప్రాంతం గుండా పొలాలకు వెళ్లే రైతులతోపాటు గ్రామస్థులు రక్షణ కోసం కర్రకు చిన్న గంట కట్టుకొని వెంట తీసుకెళ్లాలని కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్ సూచించారు. గురువారం మండలం లోని కొండాపూర్‌లో పెద్దపులి దాడిలో ఆవు మృతి చెందింది. ఈ సంఘటనలో శుక్రవారం కొడి మ్యాలలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అటవీ ప్రాంతల గుండా గ్రామస్థులు రాకపోకలు సాగించవద్దన్నారు. అటవీ శాఖ వారు ఏర్పాటు చేసిన చెక్ గేట్లకు అభ్యంతరం చెప్పవద్దన్నారు. అన్నదాతలు ఒంటరిగా కాకుండా 8 నుంచి 10 మంది కలిసి వెళ్లిరావాలన్నారు. 10 మందిలో ఇద్దరు డప్పు చప్పుడు చేయాలని, మరో ఇద్దరు విజిల్ వేయాలని సూచించారు. పొలాల వద్ద మంచె ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామం నుంచి అర కిలో మీటరు కన్నా ఎక్కువ దూరం గొర్రెలు, పశువులను మేతకు తీసుకెళ్లొద్దన్నారు. ఉదయం పది తర్వాత వెళ్లాలని, సాయంత్రం నాలుగు గంటల వరకు ఇంటికి చేరుకోవాలని అన్నారు. గ్రామ రక్షణ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పశువుల కాపరులకు పులి సంచారం, పగ్ మార్కులు కనిపిస్తే గ్రామ రక్షణ కమిటీలకు, అటవీ శాఖ అధికా రులకు సమాచారం అందించాలన్నారు. గ్రామస్థులు వెళ్లే ప్రాంతాల సమాచారాన్ని గ్రామ రక్షణ కమిటీలకు తెలుపాలన్నారు. పెద్ద పులికి ఎవరూ హాని చేయవద్దని, వలలు, ఉచ్చులు విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయవద్దని పేర్కొన్నారు. పులికి హాని కలిగించే వ్యక్తులపై వన్యప్రాణి రక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రేంజర్ వెంట డిప్యూటీ రేంజర్ ముషీర్ అహ్మద్ ఉన్నారు.

శివరాత్రికి ముస్తాబవుతున్న రాజన్న ఆలయం

● ఆలయ గోపురాలకు రంగులు

వేములవాడ కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రి జాతరకు ముస్తాబవుతోంది. మూడు రోజులపాటు నిర్వహించే మహాశివ రాత్రి జాతరను పురస్కరించుకొని ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో పనులు చకచకా నిర్వహిస్తు న్నారు. ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు, ఆలయ గోపురాలకు రంగులు వేస్తున్నారు. మహాశివ రాత్రికి రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా చర్యలు తీసుకోనున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు.


రాజన్న ఆలయ గోపురాలకు రంగులు వేస్తున్న కార్మికులు

● రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకొని, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.


రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తాం

- కేంద్ర పట్టణాభివృద్ధి, విద్యుత్, గృహనిర్మాణశాఖ మంత్రి మనోహర్‌లాల్‌ఖట్టర్
- కరీంనగర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన


కేంద్ర మంత్రి ఖట్టర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని కేంద్ర పట్టణాభివృద్ధి, విద్యుత్, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్‌లాల్‌ఖట్టర్ అన్నారు. కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. మల్టీపర్పస్ పార్కు, అంబేద్కర్ స్పోర్ట్స్ కాంప్లెక్సు, ప్రతిరోజూ నిరంతరం నల్లానీటి సరఫరా, ఈక్లాస్ రూమ్స్‌ను కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాటా డారు. కేంద్రమంత్రి మనోహర్‌లాల్‌ఖట్టర్ ప్రియమైన కరీంనగర్ ప్రజలారా నమస్తే... అంటూ తెలుగులో మాట్లాడటం ప్రారంభించి రెండు నిమిషాలపాటు తెలుగులోనే ప్రసంగించి అందరినీ ఆకట్టుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని మా ప్రభుత్వం గత పదేళ్లలో 10 లక్షల కోట్లకు పైగా నిధులను తెలంగాణ అభివృద్ధి కోసం, ఇక్కడి ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేసిందన్నారు. కేంద్రం కేటాయించిన నిధులను సకా లంలో ఖర్చు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫల మైందన్నారు. ప్రభుత్వాలు, పార్టీలు వేరైనా కేంద్రం, రాష్ట్రం కలిసికట్టుగా ముందుకెళ్లాల్సిన అవసరముందని అన్నారు. తెలంగాణ విషయంలో కేంద్రం వివక్ష చూపుతుందంటూ చేస్తున్న ప్రచారాన్ని ఖండించారు. తెలంగాణలో రైల్వే లైన్లు, స్టేషన్ల అభివృద్ధికి గత పదేళ్లలో రూ. 32,946కోట్లను కేటాయించి రాష్ట్రంలో రైల్వే స్టేషన్ల రూపురేఖలే మారుస్తున్నామని చెప్పారు. రామగుండంలో యూరియా పరిశ్రమ ఏర్పాటు చేసి ఎరువుల కొరత లేకుండా చేసిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనని కేంద్రమంత్రి ఖట్టర్ అన్నారు. రోజ్‌గార్ మేళా పేరుతో ఎలాంటి అవినీతికి, జాప్యానికి తావు లేకుండా నిర్ణీత వ్యవధిలో పరీక్షలు నిర్వహించి 9.25 లక్షల మందికి నియామక పత్రాలు అందించామన్నారు.

● కరోనాను అరికట్టడంలో కరీంనగర్ ఆదర్శం

కరోనా సమయంలో ఒకేసారి 13 పాజిటివ్ కేసులు ఈ కరీంనగర్‌లోనే మొదటిసారి వచ్చాయని


అంబేద్కర్ స్టేడియంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్

కేంద్ర మంత్రి మనోహర్‌లాల్‌ఖట్టర్ అన్నారు. ఆ సమయంలో మొదటిసారి గెలిసిన ఎంపీ బండి సంజయ్.. వైద్య సిబ్బందికి అండగా నిలిచి అతనే నేరుగా.. జిల్లా ఆసుపత్రిని సందర్శించిన వార్తలు తాను చూశానన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో క్వారంటైన్ విధానాన్ని మొదటిసారి అవలంబించి కరోనా వ్యాప్తి చెందకుండా అరికట్టారన్నారు. వ్యాక్సినేషన్ విషయంలోనూ ఇక్కడే మొదటిసారి అందరికీ పూర్తి చేసి ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. వాటర్ ప్లస్ కార్యక్రమంలో భాగంగా.. కరీంనగర్ కార్పొరేషన్‌లో వాడిన నీటిని మళ్లీ యుటిలైజేషన్ చేసే విషయంలో 2023లో కరీంనగర్ మంచిస్థానంలో నిలిచిందని అన్నారు. నిధులను సక్రమంగా వినియోగించుకోవడంలో కరీంనగర్ ముందంజలో ఉందని అన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీలో భాగంగా కమాండ్ కంట్రోల్ ఆధునీకరించారని, దీనితో ప్రజల భద్రతకు మరింత మేలు జరుగుతుందని అన్నారు. స్మార్ట్‌క్లాస్ ద్వారా పేద విద్యార్థులకు మెరుగైన బోధన అందుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారుల కోసం పట్టణాల్లో అమలు చేస్తున్న పీఎం స్వనిధి పథకం అమలు విషయంలో కరీంనగర్ దేశంలో రెండో స్థానంలో నిలిచిందన్నారు. ఇక్కడ దాదాపు 1200 మంది వీధి వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం నుంచి రుణసహాయం అందుతుందని అన్నారు. కరీంనగర్‌లో డంపింగ్ యార్డు సమస్యను పూర్తిగా పరిష్కరించేందుకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక సహాయాన్ని కేంద్రం అందిస్తుందని మంత్రి ఖట్టర్ హామీ ఇచ్చారు.

కరీంనగర్ జిల్లా అభివృద్ధిలో నెంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి

● మంత్రి పొన్నం ప్రభాకర్



రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా జిల్లా అభివృద్ధిలో నెంబర్‌వన్‌గా ఉండేందుకు అందరూ సహకరించాలని అన్నారు. డంపుయార్డు సమస్య పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, కేంద్ర ప్రభుత్వం కూడా సహక రించాలని కోరారు. కరీంనగర్ స్మార్ట్‌సిటీకి మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తోపాటు ఎంపీగా తాను, ప్రస్తుతం ఎంపీ, మంత్రి సంజయ్ కృషిచేశామని చెప్పారు.

సొంతింటి కల సాకారం చేసుకునేలా చూడాలి

● మంత్రి పొంగులేటి



రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత వరంగల్, కరీంనగర్, ఖమ్మం నగరాల్లో స్వంతింటి కలను సాకారం చేసుకునేందుకు ఇళ్లను మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద తెలంగాణకు 8శాతం ఇండ్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం 0.7శాతం మాత్రమే ఇండ్లు వచ్చాయని అన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వాటా మేరకు సంక్షేమ పథకాలు, నిధులు తెచ్చేందుకు తెలంగాణకు చెందిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ కృషిచేయాలని శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శనివారం ఉదయం 9:30 నుంచి 11:30 వరకు నగరంలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ వన్ ఏడీఈ శ్రీనివాస్ గౌడ్ ప్రకటనలో తెలిపారు. డాక్టర్స్ స్ట్రీట్, శ్రీనగర్, సివిల్ హాస్పిటల్ వెనక వైపు, గాంధీరోడ్, గర్ల్స్ జూనియర్ కాలేజ్ రోడ్, రాజీవ్ చౌక్, అహ్మద్‌పురా, రూరల్ పోలీస్ స్టేషన్, భారత్ టాకీస్ ఏరియాలు, పాతబజార్, బోయివాడ, గంజ్, సిక్‌వాడీ, మార్కెట్, టవర్ ఏరాయాలు, అన్న పూర్ణ కాంప్లెక్స్, కమాన్ ఏరియా, సీపీ ఆఫీస్ రోడ్, లక్ష్మీనగర్, రాఘవేంద్ర నగర్, కమాన్ నుంచి హౌసింగ్ బోర్డు రోడ్‌లో విద్యుత్ అంతరాయం ఉంటుందని వివరించారు.

రామడుగు: మండలంలోని వెలిచాలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో భాగంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలవరకు విద్యుతు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కమలేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడ్డెలుగులపల్లి, కిష్టరావుపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఢిల్లీలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా వెలిచాల ప్రచారం



మాట్లాడుతున్న వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రె అభ్యర్థి, ఏఐసీసీ సెక్రెటరీ రోహిత్‌చౌదరి తరపున ఆ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ప్రచారం చేశారు. శుక్రవారం ఢిల్లీలోని నాంగ్లోయ్ జాట్ నియోజకవర్గంలో నిర్వహించిన సభల్లో ప్రసంగించారు.

కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపజేయాలి

కరీంనగర్ అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి టీపీసీసీ ఎస్సీసెల్ సీనియర్ వైస్ చైర్మన్ వెన్న రాజమల్లయ్య ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 2023-24లో ఉపాధిహామీలో 20 రోజులు కూలీ పనులు చేసినవారికి, గుంట భూమిలేని కూలీలు మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అర్హతగా అధికారులు పేర్కొంటున్నారని, పదేళ్లుగా ఉపాధిహామీ పథకంలో కొత్తగా జాబ్‌కార్డులు ఇవ్వలేదని తెలిపారు. ప్రభుత్వం ఇనాం భూములు, లావనిపట్టా, బంజరు భూములను ఎస్సీ, ఎస్టీలకు పంపిణీ చేసిందని, వీరు కూడా నష్టపోతున్నారని పేర్కొన్నారు.

పొలంపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలి

భగత్‌నగర్, జనవరి24 (ఆంధ్రజ్యోతి): పొలంపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామానికి చెందిన మేకల పర్శరాం కోరారు. శుక్రవారం కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. పొలంపల్లికి మలాపూర్, మన్నెంపల్లి, పొరండ్ల మీదుగా సాయంత్రం 4.30 గంటలకు నడిచే బస్సు రావడం లేదన్నారు. రోజు వారీగా కార్మికులు, విద్యార్థులు కరీంనగర్‌కు రాకపోకలు సాగిస్తారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉదయం 8 గంటలకు మాత్రమే బస్సు ఉందని, కరీంనగర్ నుంచి పొలంపల్లికి సాయంత్రం 6.30 గంటలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

దేశ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న కొమురయ్య

కరీంనగర్ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి ముల్క కొమురయ్య అన్నారు. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన జిల్లా తపస్ కార్యనిర్వహక సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. తపస్ జిల్లా అధ్యక్షుడు కట్ట రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి అన్నమనేని తిరుపతిరావు, రాష్ట్ర కార్యదర్శి అంబటి వేణుకుమార్, కొట్నాల జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా బాలికా దినోత్సవం



ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చిత్ర లేఖన పోటీల్లో బొమ్మలు వేసిన విద్యార్థినులు

కరీంనగర్ అర్బన్ జనవరి 24(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ క్రిస్టియన్ కాలనీలోని బాలసదనంలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి సబిత కుమారి మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అంతకు ముందు ఆమె బాలికలతో కలిసి కేక్ కట్ చేశారు. బాలల సంక్షేమ సమితి చైర్ పర్సన్ ధనలక్ష్మి, డీసీపీవో పర్వీన్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు శ్రీలత, సంపత్, సంతోషి పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ రూరల్ మండలం తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల నగునూరులో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. జాతీయ సేవా పథకం ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు చిత్రలేఖనం పోటీలు ఏర్పాటు చేశారు. అనంతరం బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాలతి మాట్లాడుతూ నేటి సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య సామాజిక ఎదుగుదలపై శ్రద్ధ వహించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సమత, సీనియర్ అధ్యాపకులు పద్మజ, వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గీతారాణి, సంధ్యారాణి పాల్గొన్నారు.

అభివృద్ధిలో తోడుగా ఉంటాం

(5వ పేజీ తరువాయి)

పవిత్రమైన గోదావరి ప్రవహించే నేల ఉన్న కరీంనగర్. వేములవాడ, కొండగట్టు పవిత్రమైన ఆలయాలున్న ఆధ్యాత్మికమైన భూమి కరీంనగర్. గొప్ప చరిత్ర కలిగిన జిల్లా కరీంనగర్ అంటూ రెండు నిమిషాలు తెలుగులోనే తొలి ప్రసంగం చేసి ఆహుతులను కట్టిపడేశారు.

● మంత్రి సంజయ్ గళమెత్తడంతోనే నిధులు విడుదల

స్మార్ట్‌సిటీ నిధులను గత ప్రభుత్వం దారి మళ్లిస్తే గళమెత్తిన నాయకుడు మంత్రి మీ బండి సంజయ్ అన్నారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీలో ఈ అంశంపై నిలదీశారన్నారు. దారి మళ్లించిన నిధులను వడ్డీతోసహా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఆదేశాలు జారీ చేయించేలా చేసిన ఘనత సంజయ్‌దే అన్నారు. ఈరోజు కరీంనగర్‌లో కేంద్రం విడుదల చేసిన నిధులన్నీ ఖర్చవుతున్నాయంటే ఆ క్రెడిట్ బండి సంజయ్‌కే దక్కుతుందని అభినందించారు. ప్రతిరోజు తాగునీటిని అందిస్తున్న నగరంగా కరీంనగర్‌కు కీర్తిని తీసుకువచ్చారని ప్రజాప్రతినిధులు, అధికారులను అభినందించారు. విలీన గ్రామాలకు అవసరమైన వ్యవస్థను అభివృద్ధి చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలవాలని కేంద్రమంత్రి ఖట్టర్ ఆకాంక్షించారు. కరీంనగర్ ఎంపీ సొంతూరైన కార్పొరేషన్ మిగతా పట్టణాలకు పోటీగా అభివృద్ధి విషయంలో ముందుకు సాగాలన్నారు.

మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి

● మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్‌టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో కరీంనగర్‌ను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు పాలకవర్గం కృషి చేసిందని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. నగరంలో స్మార్ట్‌సిటీలో చేసిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి హాజరైన కేంద్ర, రాష్ట్ర మంత్రులకు శుక్రవారం నగర ప్రజలు, పాలకవర్గం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రూ.930 కోట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుల పనులకు టెండర్లు పిలిచామని, రూ.850 కోట్ల పనులను పూర్తి చేశామని అన్నారు. 2017లోనే స్మార్ట్‌సిటీ అయినా 2019లో పాలకవర్గం ఏర్పడే వరకు రూ.20లక్షల పనులు కూడా కాలేదని, బండి సంజయ్ స్మార్ట్‌సిటీ నిధుల మంజూరుకి కృషి చేయడంతోనే జరిగాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మాజీ మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ నిధుల మంజూరుకు కృషి చేశారన్నారు. 24 గంటల మంచినీటి సరఫరా సంతోషంగా ఉందన్నారు.

ఆర్టిజన్ కార్మికుల రిలే దీక్షలు



రిలే దీక్షలో ఆర్టిజన్ కార్మికులు

గణేశ్‌నగర్, జనవరి 24 (ఆంధ్ర జ్యోతి) : జిల్లా కేంద్రంలో ఆర్టిజన్ కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి ఐదోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికులను విద్యార్హతల ప్రకారం కన్వర్షన్ చేయాలన్నారు. ఐదోరోజు రిలే దీక్షలో ఆర్టిజన్ మహిళా కార్మికులు కూర్చున్నారు. నాయకులు రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ రగునాథ్ రెడ్డి, కరీంనగర్ ఆర్టిజన్ జేఏసీ చైర్మన్ శివకృష్ణ, కన్వీనర్ జీవన్, శ్రీనివాస్, శ్రీనివాస్ నాయక్, చందర్‌సింగ్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు ఘన స్వాగతం

కరీంనగర్ అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌సిటీ అభివృద్ధి పనుల ప్రారంభానికి శుక్రవారం కరీంనగర్‌కు వచ్చిన కేంద్ర, రాష్ట్ర మంత్రులకు కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్ హెలిపాడ్ వద్ద తెలంగాణ రాష్ట్ర రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ)మెంబర్ పడాల రాహుల్ స్వాగతం పలికారు. కేంద్ర పట్టణాభివృద్ధి, విద్యుత్‌శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్, కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షుడు పంజాల కృపాసాగర్, జిల్లా ప్రధానకార్యదర్శి అజీమ్ తదితరులు ఉన్నారు.

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం

కరీంనగర్ కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని భగత్‌నగర్ అంజనాద్రి క్షేత్రంలో శుక్రవారం 178వ త్యాగరాజ ఆరాధనోత్సవాన్ని నిర్వహించారు. చిలకపాటి శ్రావ్య, బొజ్జ రేవతి, కట్ట మంజుల, వాణితో సంగీత కచేరీ ఏర్పాటు చేశారు. వాయిలిన్‌పై అనంతకృష్ణ, మృదంగంపై నమిలకొండ వేణుగోపాల్ సహకారం అందించారు.

శాశ్వత పరిష్కారం చూపండి

కరీంనగర్ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బైపాస్ రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డుతో ఈ ప్రాంత ప్రజలతో పాటు రోడ్డుపై వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని 9వ డివిజన్ కార్పొరేటర్ జంగిలి ఐలేందర్‌యాదవ్ కేంద్ర, రాష్ట్ర మంత్రులను కోరారు. శుక్రవారం హౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేంద్ర మంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు డివిజన్ ప్రజల పక్షాన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి ఖట్టర్ డంపింగ్ యార్డును కేంద్రం నిధులతోనే ప్రక్షాళన చేస్తామని హామీ ఇవ్వడంతో ప్రజల పక్షాన ఐలేందర్ యాదవ్ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

గణేశ్‌నగర్, జనవరి24 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని 327 యూనియన్ కంపెనీ సెక్రెటరీ కొండూరి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం రిజిస్టర్ నంబరు 327 ఐఎన్‌టీయూసీ అనుబంధ సంస్థ కరీంనగర్ ప్రాంతీయ శాఖ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం పవర్ డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. నూతనంగా కంపెనీ సెక్రటరీగా ఎన్నికైన సందర్భంగా శ్రీనివాస్‌ను సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు పిట్టల యుగంధర్, జగిత్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తిరుపతి రాంజీ నాయక్, పెద్దపల్లి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజు, రాజకుమార్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు అల్లం తిరుపతి, సత్తార్, తులసీ, నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పునరావాస పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మహిళా, శిశు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల పునరావాస పథకం మంజూరుకు ఫిబ్రవరి 2వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి సబిత కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయం, ఇతర అనుబంధ పరిశ్రమలు, సేవా వ్యాపారాలు స్థాపించుకొని ఉపాధి పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం పథకాన్ని చేపట్టినట్లు తెలిపారు.

కొత్త పట్టాదారులకు రైతు భరోసాకు అవకాశం

భగత్‌నగర్ జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కొత్తగా పట్టాదారు పుస్తకాలు పొందిన అన్నదాతలకు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు వ్యవసాయాధికారి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24లో రైతు బంధు పొందిన రైతులు బ్యాంకు అకౌంట్ వివరాలు మార్పు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. పాత పట్టాదారులు రైతు భరోసాకి దరఖాస్తు చేసుకోని వారు ఈ నెల 31లోగా అందజేయాలని సూచించారు. రైతుభరోసా కోసం ఆధార్, పట్టాదారు బుక్, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ కాపీలు అందజేయాలని తెలిపారు.

పోస్టాఫీసులో ఆధార్ సేవలు సులభతరం

భగత్‌నగర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసులో ఆధార్ సేవలను మరింత సులభతరం చేశామని తపాల శాఖ కరీంనగర్ డివిజన్‌పోస్టల్ సూపరింటెండెంట్ శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల అవసరాల దృష్ట్యా కరీంనగర్ ప్రధాన పోస్టాఫీసులో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కొత్త ఆధార్ నమోదు, మార్పులు చేసుకోవచ్చని తెలిపారు.

బిహార్ మాజీ ముఖ్యమంత్రికి నివాళి

సుభాష్‌నగర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూర ఠాగూర్ జయంతిని జిల్లా, నగర నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మొండయ్య, సంపత్, లక్ష్మణ్‌కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

గణేశ్‌నగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఐసీఎస్ఎస్ఆర్ న్యూ ఢిల్లీ సహకారంతో మార్చి 12, 13వ తేదీల్లో నిర్వహించనున్న జాతీయ సదస్సు పోస్టర్‌ను శుక్రవారం విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్, ఏ కీ కాటలీస్టఫర్ సస్టియనబల్ బిజినెస్ డెవలప్‌మెంట్ అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెమినార్ కన్వీనర్ డాక్టర్ హరికాంత్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అధ్యాపక బృందాన్ని అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవల పథకం-24పై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న వెంకటేష్

కరీంనగర్ అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో మానసిక అనారోగ్యం, మేధో వైకల్యం ఉన్నవారికి సుప్రీంకోర్టు న్యాయ సేవల పథకం- 24 కింద న్యాయ సహాయంపై శుక్రవారం న్యాయ సదన్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి కె.వెంకటేష్ ఆధ్వర్యంలో పారా లీగల్ వలంటీర్స్ పానెల్ న్యాయవాదులకు శిక్షణ ఇచ్చారు. లీగల్‌ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తనుకు మహేష్, జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, బాలల సంక్షేమ కమిటీ మాజీ చైర్మన్ కొమురయ్య, బదిరుల పాఠశాల ప్రధానోపాధ్యాయిని కమల ఉన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దు

కరీంనగర్ రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ ఎస్సై విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ రూరల్ మండలంలోని చామనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సంధ్బంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలతో మానసిక, శారీరక, సామాజిక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. డీసీపీవో పర్వీన్, నషాముక్త్ భారత్ కో-ఆర్డినేటర్ మాలతి పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయాలి: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జమ్మికుంటలోని మున్సిపల్‌చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు నివాసంలో ఆయన మాట్లా డారు. నియోజకవర్గానికి 3500ఇళ్లు, గ్రామానికి 20ఇళ్లు వస్తే వందలమంది అర్హుల జాబితా ఎందుకు ప్రకటిస్తు న్నారన్నారు. ప్రజల పక్షాననిలబడి అడుగుతుంటే దాడులు చేస్తూ, కేసులు పెడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికార పక్షమో.. ప్రతిపక్షమో వాళ్లకే అర్థం కావడం లేదన్నారు. కొన్నిటీవీ ఛానళ్లలో వస్తున్న ట్టుగా నాపై ఎవరూ టమాటలతో దాడి చేయలేదని, అధికారుల మీద దాడి చేశారన్నారు. అధికారుల మీద టమాటలతో దాడిచేసే బదులు పేదప్రజలకు పంచండని ఎద్దేవా చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఏ ఒక్కగ్రామసభ ప్రశాంతంగా జరగలేదన్నారు. ప్రస్తుతకాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నేతలు నామోచేతి నీళ్లతాగి లక్షలు సంపాదిం చినోళ్లేనని విమర్శించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే కవ్వంపల్లి



చెరువు కట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ, నరేందర్‌రెడ్డి

మానకొండూర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మానకొండూర్ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఆయన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డితో కలిసి శుక్రవారం మానకొండూర్ పంచాయతీ పరిధిలోని డ్రైనేజీ వ్యవస్థ, మినీ ట్యాంక్‌బండ్‌పై చేపట్టిన సుందరీకరణ పనులను పరిశీలించారు. అనంతరం గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మురికి కాల్వల నిర్మాణానికి రూ.22లక్షలు, చెరువు కట్టకు ఇరువైపులా జంగల్ కటింగ్‌కు మరో రూ.2లక్షలు మంజూరు చేస్తామన్నారు. కట్టపై హైమాస్ లైట్లను ఎమ్మెల్యే నిధులు, సుడా నిధులతో ఏర్పాటు చేస్తామన్నారు. జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో రెండు మినీ మస్టర్‌లు, ఎనిమిది హైమాస్ లైట్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మర్రి ఓదెలు, మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, డీసీసీ ప్రధానకార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్, మండల యూత్ అధ్యక్షుడు కోండ్ర సురేష్, నాయకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

గంగాధర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కాంగ్రెస్ సర్కారు కృషిచేస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శుక్రవారం పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోనేశ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చొప్పదండిలో..

చొప్పదండి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): చొప్పదండిలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో చొప్పదండి యూనిట్-2025 టేబుల్‌క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి, టైగర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె శ్రీధర్, జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, చొప్పదండి అధ్యక్షుడు కామసతీష్, తదితరులు పాల్గొన్నారు.

రైతులతో అధికారుల సమావేశం

చొప్పదండి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రైతులు, మత్స్యకారుల మధ్య గురువారం రేవెల్లి చెరువు నీటివివాదం తలెత్తగా అధికారులు మండలంలోని రాగంపేట, దేశాయిపేట, చిట్యాలపల్లి రైతులతో శుక్రవారం మండలపరిషత్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. పంట అనంతరం నీటిని వాడ వద్దని, వాడితే ప్రభుత్వ నిబంధన మేరకు విద్యుత్ మోటార్లను తొలగించుటకు తీర్మానించారు. సమావేశంలో తహసీల్దార్ నవీన్‌కుమార్, సీఐ ప్రకాశ్, ఎస్ఐ అనూష, విద్యుత్, ఇరిగేషన్‌శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి మైలారం మల్లికార్జునస్వామి జాతర

గన్నేరువరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారం మల్లికార్జునస్వామి జాతర శనివారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ చైర్మన్ వరాల పర్శరాములు ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం స్వామివారి పల్లకిసేవ, ఒగ్గు కళాకారులతో ఊరేగింపు చేయనున్నారు. ఆదివారం పెద్దపట్నాలు, స్వామి వారి కల్యాణం, అభిషేకం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కేంద్ర మంత్రి సభకు తరలిన బీజేపీ శ్రేణులు

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన కేద్ర మంత్రి మనోహర్ లాల్‌కట్టర్ సభకు రేకుర్తి బీజేపీ నాయకులు తరలి వెళ్లారు. రేకుర్తిలో బీజేపీ మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, వెస్ట్ జోన్ మాజీ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, వెస్ట్ జోన్ కన్వినర్ జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో 17, 18, 19 డివిజన్ బీజేపీ నాయకులు శుక్రవారం తరలి వెళ్లారు. కార్యక్రమంలో గోదరి నరేష్, ఎర్రోళ్ల ప్రశాంత్, కీసర విష్ణు, ప్రసాద్‌రావు, పింగిలి ప్రతాపరెడ్డి, వినీత్, వేణు, బండ రాకేష్, నాంపల్లి శంకర్, జాడి ఎల్ల అంజనేయులు, దుర్గం మోహన్, నవీన్, రాములు, బండారి లక్ష్మణ్, బండారి గోపి, గోదరి సంపత్, దుర్గం ప్రభాకర్ పాల్గొన్నారు.

గన్నేరువరం/తిమ్మాపూర్: గన్నేరువరం నుంచి బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్, ఏలేటి చంద్రారెడ్డి, గుంటుక లక్ష్మీపతి, అనిల్‌రెడ్డి, తిమ్మాపూర్ నుంచి బీజెవైఎం జిల్లాఅధ్యక్షుడు గడ్డం అరుణ్, మండల ప్రధానకార్యదర్శి తిరుపతిరెడ్డి, నాయకులు ఉన్నారు.

అలుగునూరులో ప్రత్యక్షమైన అఘోరి మాత

తిమ్మాపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వార్తల్లోకి ఎక్కిన అఘోరీ మాత కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరులో ప్రత్యక్షమైంది. ఈ సందర్భంగా ఆమె అలుగునూరులో ఓ పెట్రోల్ పంప్ లో కారును ఆపగా యువకులు ఆమెతో సెల్ఫీ దిగేందుకు ఉత్సాహం చూపారు. విషయం తెలుసుకున్న విలేకరులు ఆమెతో మాట్లాడారు. సందర్భంగా అఘోరి మాత మీడియాతో మాట్లాడారు తను మహా కుంభమేళా నుండి వస్తున్నానని ఫిబ్రవరి 3న వేములవాడలో ఉన్న మసీదును కూల్చేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. సనాతన ధర్మాన్ని కాపాడే ప్రయత్నంలో తన ప్రాణాలు పోయినా లెక్క చేయనని చెబుతుంది. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు హిందూ ధర్మాన్ని కాపాడడంలో ముందుంటానని, ఆడపిల్లల విషయంలో అన్యాయం జరిగిన తాను ముందుంటానని తెలిపారు.

హుజూరాబాద్ మున్సిపాలిటీలో 3644 దరఖాస్తులు

హుజూరాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపాలిటీలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నాలుగు సంక్షేమపథకాలకోసం 3644 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎక్కువగా ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. హుజూరాబాద్ మున్సిపాలిటీలో 30 వార్డులు ఉండగా, ఈ నెల21,22వతేదీల్లో మున్సిపల్‌అధికారులు వార్డు సభలు నిర్వహించారు. ఇందులో రేషన్‌కార్డుల కోసం 2090, ఇందిరమ్మ ఇళ్ల కోసం 1501, రైతు భరోసా కోసం 24, ఇందిరమ్మ ఆత్మీయభరోసాకోసం 29దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలురాగానే విచారణ జరిపి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేస్తామని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు.

ముగిసిన గ్రామసభలు

శంకరపట్నం/ఇల్లందకుంట/వీణవంక: మండలాల్లో ప్రజాపాలన గ్రామసభలు ముగిశాయి. శుక్రవారం శంకరపట్నంలో ఆయాగ్రామాల అధికారులు దరఖాస్తుదారుల వివరాలజాబితాలు చదివి వినిపించారు. జాబితాలో పేర్లులేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇల్లందకుంటలో ఇందిరమ్మ ఇళ్లకోసం స్థలం ఉండి ఇళ్లకావాల్సిన వారు 3402మంది, 581మంది భూమిలేక ఇళ్లకావాల్సిన లబ్ధిదారులు ఉన్నట్లు ఎంపీడీవో జిల్లెల పుల్లయ్య పేర్కొన్నారు. వీణవంకమండల వ్యాప్తంగా 1535రేషన్‌కార్డు, 1062ఇందిరమ్మ ఇళ్లు, ఇందిమ్మ ఆత్మీయభరోసా కింద 530 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో శ్రీధర్, తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

గంగాధర, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో కస్తూరి అన్నారు. శుక్రవారం నాగిరెడ్డిపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభను నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు, గర్భవతులకు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తక్కువ బరువున్న పిల్లలకు బలమైన ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్‌లో పెరటి కోళ్ల పంపిణీ

మానకొండూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళిక కింద శుక్రవారం మానకొండూర్ పశువైద్యశాలలో లబ్ధిదారులకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎస్సీ రైతులకు రెండు వేల కోళ్లతో పాటు నీటి తొట్టీలను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ దాసరి శ్రీనివాస్, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ రాంబాబు, సహాయసంచాలకులు డాక్టర్ వినోద్‌కుమార్, పశువైద్యులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా డీటీఎఫ్ మండల కమిటీ

ఇల్లందకుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సార్ల సంపతి, ప్రధానకార్యదర్శిగా చిటికెన వేణు, ఉపాధ్యక్షులుగా రమాదేవి, రాజిరెడ్డి, సంతోష్, ఉమాదేవి, కార్యదర్శులుగా ప్రకాష్, రామకృష్ణ, అనిల్, తిరుపతిరెడ్డి, జిల్లా కౌన్సిలర్లుగా శ్రీనివాస్, సమ్మిరెడ్డి, రమాదేవి, శాంతమ్మ, శ్రీధర్, ఆడిట్‌కమిటీ కన్వీనర్‌గా రవి తదితరులు ఎన్నికయ్యారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

రామడుగు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గడికోట మైదానంలో ఆర్‌పీఎల్ సీజన్-4 క్రికెట్‌టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. ఈ టోర్నీలో 8జట్లుపాల్గొని దాదాపు15రోజుల వరకు సాగింది. రామడుగు ట్రిబుల్ ఆర్‌టీంతో తిరుమలాపూర్ జట్టు ఫైనల్‌లో తలపడగా తిరుమలపూర్ మొదటి విజయం, ద్వితీయ స్థానం రామడుగు ట్రిబుల్‌ఆర్‌టీం నిలిచింది. మొదటి బహుమతి కింద పూరెల శేఖర్ రూ.10వేలు, ద్వితీయ బహుమతి తోటకృష్ణ రూ.5వేలతోపాటు రెండు జట్లకు జెర్సీలు అందించారు. కార్యక్రమంలో బీసీసెల్ అధ్యక్షుడు పులిఅంజనేయులుగౌడ్, నాగశేఖర్, ఆనందం, ఆర్గనైజర్స్ మనోజ్, తిరుపతి, చందు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు క్రీడాదుస్తులు పంపిణీ

వీణవంక, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండ లంలోని మల్లారెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం ఎంఈవో శోభారాణి క్రీడ దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాగంపేట చంద్రశేఖర్ రావు, ఉపాధ్యాయులు ఉన్నారు.